## క్లుప్తంగా

### కరెంటు ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: చెంగిచెర్ల 33/11 కేవీ ఆర్టీసీ ఫీడర్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు మేడిపల్లి విద్యుత్ ఏఈ ప్రదీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీకాలనీ, డాక్టర్ కాలనీ, వెంకటాద్రినగర్, ఆదర్శనగర్, సాయిరెసిడెన్సీ, శివశక్తినగర్, అరవింద కాలనీ, గణేష్‌నగర్, సుశీల టౌన్‌షిప్, ఇంద్రానగర్ కాలనీల్లో కరెంటు సరఫరా ఉండదని అన్నారు.

### నేడు కాశీవిశ్వనాథుడి కల్యాణ మహోత్సవం

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని శ్రీకాశీవిశ్వనాథ స్వామి వారి 58వ వార్షికోత్సవ కల్యాణం సోమవారం వైభవంగా జరగనుంది. ఉదయం 9 గంటలకు వరసిద్ధి గణపతి పూజతో వార్షిక కల్యాణోత్సవం ప్రారంభమై ఆంజనేయస్వామి వారికి అభిషేకం అనంతరం ఉదయం 11 గంటలకు శ్రీకాశీవిశ్వనాథ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. సాయంత్రం 6:30 గంటలకు ఊరేగింపు ఉంటుందన్నారు.

### ఏఎస్‌రావునగర్‌లో బలగం టీమ్ సందడి



కాప్రా: బంగారు ఆభరణాలు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. అందుకోసమే మగువల అభిరుచులకు అనుగుణంగా ఆభరణాలు అందించడమే ఒరాఫో జువెలర్స్ లక్ష్యమని షోరూం డైరెక్టర్ కల్యాణ్‌రామ్ అన్నారు. నగరంలో మూడో షోరూంను ఆదివారం ఏఎస్‌రావునగర్‌లో ప్రారంభించారు. షోరూమ్‌ను బలగం టీమ్ ప్రారంభించింది.

### నివాళి



విఠల్ సిద్ధాంతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ తండ్రి ప్రముఖ జ్యోతిష పండితులు పాముల విఠల్ సిద్ధాంతి(దశదిన కర్మ) వలిగొండలో నిర్వహించారు. పలువురు నేతలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలగం చిత్రంలో క్లైమాక్స్ పాట పాడిన మొగులమ్మ, కొముర‌య్యల బృందం ఆయన సేవలను గుర్తు చేసుకుంటూ పాటలు పాడారు. బీఆర్‌ఎస్ నేతలు శ్రీరాం సత్యనారాయణ, కట్ట బుచ్చన్నగౌడ్, అంజి, సుగుణాకర్, రమేష్, శేఖర్, రఫిక్, శ్రీనివాస్, మహేష్, శివ, సంతోష్ ఉన్నారు.

### 'కృష్ణవేణి'లో గ్రాడ్యుయేషన్ డే



మౌలాలి: ఓల్డ్ సఫిల్‌గూడలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లోని ప్రీ ప్రైమరీ విభాగంలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ రాజు సంగని, డైరెక్టర్ ఈ.చంద్రమౌళి, జోన్ మేనేజర్ బుచ్చిరెడ్డి, ప్రిన్సిపల్ జాన్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మరక్షణకు కరాటే..

మల్లాపూర్: ఆత్మరక్షణకు, ఆత్మస్థైర్యానికి కరాటే ఎంతగానో దోహదపడుతుందని శివప్రసాద్ అన్నారు. తార్నాకలో జరిగిన బ్రూసలీ ఛోటాఖాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీలో నాచారం ప్రాంతానికి చెందిన 30 మంది విద్యార్థులు కలర్స్ బెల్టులు సాధించారు. కార్యక్రమంలో హరీష్‌కుమార్, శివప్రకాష్, హరికేశవ, సాయికుమార్, వంశీ, నరేష్, యేగేష్ పాల్గొన్నారు.

- ఆధార్ లేనిదే.. బ్యాంకుతో సహా మరేక్కడైనా పనులు జరగాలంటే కష్టమే
- పదేళ్లకోసారి కార్డును నవీకరించుకోవాలని కేంద్రం ఆదేశం
- ఆధార్ అప్‌డేట్ కోసం అందుబాటులోకి మీసేవా, ఆధార్ కేంద్రాలు




# అన్నింటికీ ఆధార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆధార్ కార్డు ఇప్పుడు తప్పనిసరి అయ్యింది. రుణాలు పొందాలన్నా.. బ్యాంకు ఖాతా తీయాలన్నా.. ఆస్తిపరమైన లావాదేవీలకు.. జనన ధ్రువీకరణ పత్రానికి.. ఇలా ఏ అంశానికైనా ఆధార్ లేనిది పనులు జరగడం లేదు. ఇంటి పేరు, చిరునామా వేర్వేరుగా ఉన్నా, తప్పులు దొర్లినా అది ఉపయోగపడటం లేదు. పదేళ్లకోసారి కార్డులో వివరాలను నవీకరించుకోవాలని కేంద్రం ఆదేశించింది. ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోని వారు వెంటనే చేసుకోవాలని చెబుతోంది. ఈ మధ్య కాలంలో అప్‌డేట్ చేసుకుంటే నవీకరణ అవసరం లేదు. పట్టణ ప్రాంతాల్లో ఆధార్ కార్డు నవీకరణకు మీసేవా, ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- పేరులో మార్పు: పేరులో సవరణ కోసం తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కలిగిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. పదోతరగతి మెమో, ఓటరు గుర్తింపుకార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధిహామీ జాబ్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం తదితర వాటిలో ఏదైనా జత చేయాలి. ఉద్యోగులు గుర్తింపు కార్డు, తహసీల్దార్ ఇచ్చే కుల ధ్రువీకరణపత్రం సమర్పించవచ్చు.
- పుట్టిన తేదీ: ప్రస్తుతం చిన్నారులకు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. కార్డులో ఒక్కసారి మాత్రమే పుట్టిన తేదీని మార్చుకునే వీలుంది. రెండోసారి కావాలంటే రాష్ట్ర రాజధానిలోని యూఐడీఏఐ కార్యాలయానికి వెళ్లి తగిన వివరణ ఇస్తూ.. ఆధారాలు, ధృవీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుంది.
- చిరునామా: ప్రతి పదేళ్లకోసారి కార్డులో చిరునామా, స్థానికతను నిర్ధారించుకుంటూ నవీకరణ చేసుకోవాల్సి ఉంటుంది. దీనికి చిరునామా ధ్రువీకరణను జత చేయాలి. గతంలో గెజిటెడ్ అధికారుల సంతకంతో పేరు, తండ్రి పేరు, పుట్టినతేదీ, చిరునామా మార్చిడీ చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం తహసీల్దార్, పురపాలక కమిషనర్ జారీ చేసిన గుర్తింపు పత్రం చూపాల్సిందే. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇచ్చే పత్రంతో విద్యార్థులు మాత్రమే మార్చుకోవచ్చు. ఇతరులకు పని చేయవు. ఓటరు గుర్తింపు పత్రం, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాసుపోర్టులో సరైన చిరునామా ఉంటే వాటితో సరి చేసుకోవచ్చు. కరెంట్ బిల్లు, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ కనెక్షన్, ధ్రువపత్రం వినియోగించుకోవచ్చు.

#### మూడు విభాగాలుగా దరఖాస్తులు..

గతంలో సవరణకు రెండు రకాలుగా దరఖాస్తు పత్రాలు ఉండేవి. ప్రస్తుతం వయసు ఆధారంగా మూడు విభాగాలుగా విభజించారు. ఒకటి అయిదేళ్లలోపు పిల్లలు, రెండోది 5 నుంచి 18 ఏళ్ల ఉన్న వారు. మూడోది ఆపై వయసు ఉన్న వారిగా విభాగాలుగా దరఖాస్తు ఫారాలు నిర్దేశించారు. నవీకరణలో ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. 18 ఏళ్ల పైబడి కొత్తగా దరఖాస్తు చేస్తే సంబంధిత తహసీల్దార్ ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది.

#### శిబిరాల ఏర్పాటుపై కసరత్తు

ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అవసరమైన కేంద్రాలు ఉన్నాయి. అవసరాన్ని బట్టి అదనంగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో స్థానిక మేయరు లేదా చైర్మన్, కమిసనర్లు, సర్పంచ్, కార్యదర్శిని సంప్రదించి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై ఒక రోజు ముందుగా సమాచారం అందించేలా కసరత్తు చేస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో స్వామివారి కల్యాణం



కల్యాణానికి స్వామివారి విగ్రహాలను తీసుకెళ్తూ..

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో పాకాల కుంట మల్లికార్జునస్వామి దేవాలయంలో మల్లికార్జున స్వామి, కేతమ్మ వారి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ముందుగా బోనాల సమర్పణతో పాటు అగ్ని గుండాలు, గొలుసు తెంపుట కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమానికి యాదవ సంఘం నాయకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, సింగ్ యాదవ్, నాగులు యాదవ్, బాలరాజ్ యాదవ్, సత్యనారాయణ యాదవ్, చిన్నా యాదవ్, శేఖర్ యాదవ్, ముత్యాలు, కృష్ణ, జానకి, రాములు, శ్రీశైలం, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం




మాట్లాడుతున్న కార్పొరేటర్

బోడుప్పల్: మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని కార్పొరేటర్లు బింగి జంగయ్యయాదవ్, కొత్త చందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్ అన్నారు. చెంగిచర్ల రెండో డివిజన్‌లోని సాయినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మురుగు సమస్య కేవలం రెండో డివిజన్‌కు సంబంధించింది కాదని, మూడు డివిజన్ల పరిధిలో ఉందన్నారు. త్వరలో జరగనున్న కౌన్సిల్‌లో ఈ విషయంపై చర్చించి నెల రోజుల్లో ఈ పనిని పూర్తిచేస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఎస్ఎన్‌డీపీ పనులు ప్రారంభం ఆలస్యం కావడం వల్లే ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు రమణమూర్తి, నర్సింహారెడ్డి, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



ఉప్పల్ హిల్స్‌లో పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజితరెడ్డి తదితరులు

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ కుర్మానగర్‌లో ఆదివారం ఉప్పల్ సర్కిల్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జోడో యాత్ర నిర్వహించారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని కురుమానగర్, ఉప్పల్ హిల్స్, లక్ష్మీ నరసింహ కాలనీల్లో డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, స్థానిక కార్పొరేటర్ మందముల రజిత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. టీపీసీసీ ప్రతినిధులు మేకల శివారెడ్డి, ఎండి తౌఫిక్, కృష్ణారెడ్డి, బోరంపేట కృష్ణ, సుర్వి మురళిగౌడ్, తెల్కల మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### వీధి కుక్కల నియంత్రణకు మరిన్ని చర్యలు

ఉప్పల్: వీధి కుక్కల నియంత్రణకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని చిలుకానగర్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ హైలెవల్ కమిటీ సభ్యురాలు బన్నాల గీత ప్రవీణ్ సూచించారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇటీవల శేరిలింగంపల్లిలోని కుక్కల సంరక్షణ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



వీధి కుక్కల సంరక్షణ కేంద్రంలో బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

## ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు 200కు పైగా నమూనాలను ప్రదర్శించారు. సైన్స్, మాథ్స్, సోషల్ సబ్జెక్ట్‌కు సంబంధించిన ప్రాజెక్టులను వర్కింగ్, నాన్ వర్కింగ్ మోడల్స్‌గా తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో రోప్ బ్రిడ్జ్, సోలార్ సిస్టమ్, గ్లోబ్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్, ఎయిర్ పొల్యూషన్, వాటర్ పొల్యూషన్, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ, మోడల్ విలేజ్, మెట్రో రైల్ మొదలైన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయన్నారు.

### హైటెక్ నగర్ నూతన కమిటీ

కాప్రా: ఎల్లారెడ్డిగూడలోని హైటెక్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ కె.సంజయ్‌కుమార్, జనరల్ సెక్రటరీ రొండ్ల ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎంవీవీ వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.ఎస్.మిశ్రా, కోశాధికారి ధరణిపతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సీతాపతిరావు, వేదగిరి ఈశ్వర్, మహేష్‌గౌడ్, సలహాదారులుగా రఘునందన్‌రావు, సారంగపాణి, రవికుమార్, బాపిరాజు, వెంకటేశ్వరరావు, వైవీఎస్ మూర్తి, సాంబశివుడు, నారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.



## మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ఎస్పీనగర్‌లో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తూ..



ప్రగతినగర్‌లో జోడో యాత్ర

మౌలాలి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కావడానికి మంత్రి కేటీఆర్ కారణమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మౌలాలి డివిజన్ ఎస్పీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ వెంకటేష్‌యాదవ్, వంశీ ముదిరాజ్, వినోద్ యాదవ్, అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇంటింటికీ తిరిగి.. సమస్యలు తెలుసుకుంటూ..**

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ ఆధ్వర్యంలో మౌలాలి డివిజన్ చందాబాద్, ప్రగతినగర్, గాంధీనగర్‌లో ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, నాయకులు వంశీ ముదిరాజ్, ఉమామహేశ్వరియాదవ్, వినోద్‌యాదవ్, అరుణ్ గౌడ్, హమీద్, సత్తన్న, రవి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించండి



కీసర: ప్రజలంతా తమ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని కీసర గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన కీసరలో పన్నుల వసూలు నిమిత్తం బిల్‌కలెక్టర్లతో కలిసి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఆయన మాట్లాడుతూ.. మార్చి 31వ తేదీ వరకు వంద శాతం పన్నులు వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 70 శాతం మేర పన్నులు వసూలు చేశామని, మిగతా 30 శాతం పన్నులను కూడా ఈ నెలాఖరులోగా వసూలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బిల్‌కలెక్టర్లు రాంబాబు, హాషిమ్, బాల్‌నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

**పన్నులు విధిగా చెల్లించాలి**

మేడ్చల్: ప్రజలు తమ ఆస్తి పన్నులను మున్సిపాలిటీకి విధిగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన ట్యాక్స్ వసూలు డ్రైవ్‌లో ఆయన పాల్గొని పన్నులు వసూలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంచందర్, సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రాన్స్‌కో.. ఇంత నిర్లక్ష్యమా..?



రామంతాపూర్: ఇటీవల నగరంలోని పద్మారావునగర్ పార్కులో విద్యుత్ తీగలు కిందకు తెగిపడి ఉండటంతో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వ్యక్తి తీగలకు తాకి మృతిచెందిన విషయం తెలిసిందే.. రామంతాపూర్ ఆర్టీసీ కాలనీ మీ సేవ కేంద్రం వద్ద ఆదివారం విద్యుత్ తీగలు తెగిపోయి వేలాడుతూ ఉన్నాయి. గమనించిన స్థానిక యువకులు విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులకు ఫోన్ చేస్తే సిబ్బంది ఎవరూ లేరని ఫోన్ పెట్టేసారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసిన 3 గంటల వరకు విద్యుత్ సిబ్బంది రాకపోవడంతో యువకులు అక్కడే అటు వైపు ప్రయాణించే వాహనదారులను దారి మళ్లించారు. మూడు గంటల తర్వాత మరమ్మతులు చేసి వెళ్లిపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సంక్షేమ సంఘం నాయకులు కోరుతున్నారు.

### మునీరాబాద్‌లో క్రికెట్ టోర్నీ

మేడ్చల్‌రూరల్: మంత్రి మల్లారెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని మునీరాబాద్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గ్రామానికి చెందిన కుతాడి బ్రదర్స్ నిర్వహించిన టోర్నీలో పలు జట్లు పాల్గొనగా విన్నర్‌కు రూ.5 వేలు, రన్నరప్ జట్టుకు రూ.3 వేల నగదుతో ట్రోఫీలను వార్డు సభ్యుడు కుతాడి నరేందర్, మాజీ సర్పంచ్ మహేందర్‌లు అందజేశారు. కార్యక్రమంలో కర్నాటకం రాజశేఖర్, గూడూరు రాజు, వార్డు సభ్యులు శ్యామలరమేష్, బిక్షపతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### భారీ వర్షానికి నెలకొరిగిన చెట్టు

మల్లాపూర్: శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మల్లాపూర్ మైఫ్లవర్ అపార్ట్‌మెంట్‌లోని ఓ భారీ చెట్టు కూలి కారుపై పడింది. వడగండ్లలతో పాటు గాలిదుమారానికి చెట్లు విరిగిపోయాయి. మల్లాపూర్ వెంకటరమణ కాలనీ, బ్రహ్మపురి కాలనీ, నాగలక్ష్మీనగర్, బ్యాంక్ కాలనీల్లో కరెంట్ సరఫరా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### త్రివేణి పాఠశాల వార్షికోత్సవం



అల్వాల్: అల్వాల్‌లోని సీవీఆర్ గార్డెన్స్‌లో త్రివేణి పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రికి పెళ్లిరోజు శుభాకాంక్షలు



మేడిపల్లి: రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి దంపతులకు ఆదివారం పలువురు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. పీఎంసీ 2వ డివిజన్ కార్పొరేటర్ సుభాష్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు పగడాల బాలరాజ్, బీఆర్‌ఎస్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు శంకర్‌చారి, బి.మల్లేష్ తదితరులు ఉన్నారు.

### 'సుప్రభాత్'లో సందడి

మల్లాపూర్: నాచారం సుప్రభాత్ మోడల్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు పట్టాలను అందజేశారు. పాఠశాల డైరెక్టర్ సంపత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు వాగేశ్వరీ, అడ్మిన్ ఆఫీసర్ ఆశాలత తదితరులు ఉన్నారు.

### బాక్స్ డ్రైనేజీ పనులకు ఆటంకం





కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ



అల్వాల్: డివిజన్ పరిధిలోని తిరుమల ఎన్‌క్లేవ్ స్థలాన్ని ఆదివారం స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. గత రాత్రి కురిసిన వడగళ్ల వాన కారణంగా కొనసాగుతున్న బాక్స్ డ్రైనేజీ పనులకు ఆటంకం కలిగిందని కాంట్రాక్టర్ నీటిని తొలగించాలని, పనికి ఆటంకంగా ఉన్న స్తంభాలను మార్చాలని అధికారులను ఆదేశించారు.

**కొనసాగుతున్న పైప్‌లైన్ పనులు**

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ భరత్‌నగర్‌లో కొనసాగుతున్న వాటర్ పైపులైన్ పనులను స్థానిక టీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్ ఇతర నేతలు పరిశీలించారు.

**కౌకూర్ భరత్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన**

మౌలాలి: నగరంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నాలాలు పొంగిపొర్లాయి. ఆదివారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ అధికారులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. ఐఆర్‌టీ లేబర్‌తో పనులను చేయించారు. ఏఈ సత్యలక్ష్మీ, సూపర్‌వైజర్ సాగర్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సుమలత, నరేందర్, సూరి పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు చేయించుకుంటున్న రాగిడి లక్ష్మారెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొడిగే స్వాతిగౌడ్

ఉప్పల్: మధురా చారిటబుల్ ట్రస్టు, కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉప్పల్ బీరప్పగడ్డలోని సెయింట్ మార్క్స్ పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్టు చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా నిరుపేదలకు పలు విధాలుగా సేవలు అందించడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టీపీసీసీ డెలిగేట్ మేకల శివారెడ్డి, సుధాకర్ శెట్టి, మాజీ కౌన్సిలర్ రాజ్యలక్ష్మీ, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, ఎయిమ్స్ చైర్మన్ షబ్బీర్ అలి, శేఖర్‌రెడ్డి, జనార్దన్, విజయ్ నాగిరెడ్డి, తులసిరామ్ పాల్గొన్నారు.

**ధర్మపురి కాలనీలో రక్తదాన శిబిరం**

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో ధర్మపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, టెంపుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రక్తదానం మహాగొప్పదన్నారు. కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, వేణుగోపాల్, పర్వేష్‌సింగ్, ఎన్వీ శ్రీనివాస్, మాణిక్ ప్రభు, ప్రకాశ్, రఘునందన్ పాల్గొన్నారు.

**ఉప్పల్ డిపో సమీపంలో..**

మేడిపల్లి: ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందజేయడం అభినందనీయమని పీర్జాదిగూడ కార్పొరేషన్ 5వ డివిజన్ కార్పొరేటర్ బొడిగే స్వాతి కృష్ణాగౌడ్ అన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి ఉప్పల్ డిపో సమీపంలో ఆదివారం ఏబీ న్యూలైఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారు. డాక్టర్లు నిశాంత్, శ్రవంతి, అంజన్ కుమార్, సరితాగౌడ్, గిరీష్‌రెడ్డి, శ్రీధర్ ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

**ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు**

మేడిపల్లి: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. పీఎంసీ ఉపాధ్యక్షుడు రాంపల్లి యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లోని 16, 17వ వార్డుల్లో నిర్వహించారు. వెయ్యి మంది కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. సీనియర్ నాయకుడు కొంపల్లి మోహన్‌రెడ్డి, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పీఎంసీ కార్పొరేషన్ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.